విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 03, డిసెంబరు 2025

రబీ సీజన్‌లో ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వండి

- వరి పంటలు వేసుకోవద్దు
- జిల్లా మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి
- ఎస్సార్బీసీ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రబీ సీజన్‌లో వరి పంటలకు బదులుగా ఆరుతడి పంటలను వేసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి అధ్యక్షతన నీటి పారుదల సలహా మండలి సమావేశం జరిగింది. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, ప్రొద్దు టూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, కేసీ కెనాల్ చైర్పర్సన్ రామలింగారెడ్డి, తెలుగు గంగ ప్రాజెక్టు చైర్మన్ సంజీవకుమార్ రెడ్డి, ఎస్ఆర్బిసి చైర్పర్సన్ కె. రాజశేఖర్ రెడ్డి, సాగునీటి సంఘాల నాయకులు, ఇరిగేషన్ అధి కారులు, రైతులు పాల్గొన్నారు. మంత్రులు మాట్లాడుతూ రబీ పంట లకు సాగునీరు అందించే అంశంపై సుదీర్ఘంగా చర్చిం చిన పిదప వరి పంటలకు బదులుగా ఆరు తడి పంటలను వేసుకో వాలని సూచించారు. కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, తెలుగు గంగ ఆయకట్టుల్లో ఎంత మేరకు నీరు విడుదల చేయాలనే అంశంపై ఇరిగేషన్ అధికారులతో సమగ్రంగా సమీక్షించామన్నారు. ఎస్సార్బీసీ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కేసీ కెనాల్ పరిధిలో తుంగభద్ర ప్రాజెక్ట్ గేట్లు కొత్తగా నిర్మించడంతో తాత్కాలిక ఇబ్బందులు ఎదురవు తున్నాయ న్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో నీటి పారుదల, ఆరుతడి పంటల ప్రణాళిక ప్రకారం ఆయకట్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ ద్వారా రబీ పంటలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేసే నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. తెలుగు గంగ ప్రాజెక్ట్ పరిధిలో మార్చి 31 వరకు సాగునీరు అందించే వీలున్నదని, ఇప్పటికే శ్రీశైలం మండలంలోని వెలుగోడు, బండి ఆత్మకూరు మండ లాల్లో వరి సాగు ప్రారంభమైనప్పటికీ, దిగువనున్న ఆళ్లగడ్డ నియోజక వర్గానికి వరి సాగు నీరు ఇవ్వడం సమస్యగా ఉన్న కారణంగా ఆరుతడి పంటలకు మాత్రమే నీరు అందిస్తున్నట్లు తెలిపారు.

ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలి : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలోని జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లి తండకు చెందిన ఐఏఎస్ అధికారి చిన్న రాముడు కుమార్తె మాధురి సాహితీబాయ్ మృతిపై ఉన్నత అధికారులు సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి ఐఏఎస్ హోదాలో ఉన్న చిన్న రాముడు కుమార్తె మాధురి బుగ్గానిపల్లెకు చెందిన రాజేష్ నాయుడు అనే వ్యక్తిని ప్రేమించి ఈ ఏడాది మార్చి 7న మహానంది ఆలయంలో కులాంతర వివాహం చేసుకోవడం జరిగిందని, మాధురి తల్లిదండ్రులు అప్పటి ఎస్పీకి ఫిర్యాదు చేయగా యువతి తల్లిదండ్రుల ఆమోదంతో బేతంచెర్ల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ చేయిం చడం జరిగింద న్నారు. వారిద్దరూ అన్యోన్యంగా ఉన్న సమ యంలో మాధురి తన భర్తకు ఉద్యోగం లేదని ఉద్యోగం వచ్చిన తర్వాత సంసారానికి వస్తానని పోలీసుల సమక్షంలో రాత పూర్వకంగా ఇవ్వడంతో పోలీసులు మాధురిని తన తల్లి తండ్రులకు అప్పచెప్పడం జరిగిందని, తాడేపల్లి లోని తన తల్లిదండ్రుల వద్ద ఉన్న మాధురి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన సంఘటన బాధాకరమని, వాస్తవాలను వెలికి తీయకపోతే రెండు కులాల మధ్యన అంతరాలు పెరిగే అవ కాశం ఉంటుందని, కావున ఉన్నతాధికార్యాలు ఈ సంఘ టనపై సమగ్ర దర్యాప్తు జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అర్జీలను స్వీకరించిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె : ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు & భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన వలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. బాధితుల సమస్యలను సంబం ధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పాడి పెంపకాన్ని ప్రోత్సహించండి

విశాలాంధ్ర - సంజామల : రైతులకు అవగాహన కల్పించి పాడి పెంపకాన్ని ప్రోత్సహించాలని పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ కొండా రెడ్డి అన్నారు. సంజామల మండల కేంద్రం పశువుల ఏరియా ఆసుపత్రిలో పశువైద్య సిబ్బందితో డాక్టర్ ఏడి కొండారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి పశు సంపదను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఎస్ఎస్ ఇంజక్షన్‌లపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇంజక్షన్ వలన 90శాతంపై దూడ జన్మించే అవకాశం ఉందని ఏడి అన్నారు. డాక్టర్ కృష్ణ కుమార్ కొలిమిగుండ్ల డాక్టర్లు రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం ఫిజికల్ సైన్స్, ఎస్ ఏ ఉర్దూ పోస్టులకు అర్హులైన వారి నుండి దరఖాస్తు కోరుతున్నట్లు కోవెలకుంట్ల మండల విద్యాశాఖ అధికారి వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ అమరావతి వారి ఉత్తర్వులు, జిల్లా విద్యాశాఖాధికారి, నంద్యాల వారి ఉత్తర్వుల మేరకు అకడమిక్ ఇన్స్ట్రక్టర్స్‌ను నియమించుటకు ఆదేశాలు జారీచేసినట్లు మండల విద్యాధికారి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోపు మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను మంగళవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని వారితో పాటు మధ్యాహ్నం భోజనం పరిశీలించడం జరిగింది. బాత్రూమ్‌లు, భోజనశాల, పరిసరాలలో సరైన శుభ్రత, పిల్లల ఆరోగ్యం, భద్రత సమస్యలు అనారోగ్యం వచ్చినప్పుడు తక్షణమే వైద్య సహాయం లేదా నర్సు అందుబాటులో లేకపోవడం గురించి వార్డెన్ లేదా సిబ్బంది విద్యార్థుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు శశిధర్ రెడ్డి, పట్టణ నాయకులు సంతోష్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో మంగళవారం వసతి గృహ సంక్షేమ అధికారి సురేష్ దుప్పట్లు పంపిణీ చేశారు. 90 మంది విద్యార్థులకు 90 దుప్పట్లు, 90 కార్పెట్లు పంపిణీ చేశారు. సంక్షేమ అధికారి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని శీతాకాలం కావడంతో ప్రభుత్వం విద్యార్థులందరికి దుప్పట్లు అందజేయడం జరిగిందన్నారు. హాస్టల్ భవన మరమ్మతులు, కిటికీలకు మెస్ సదుపాయాలు కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. పేద విద్యార్థుల కొరకు ప్రభుత్వం సదుపాయాలు కల్పించడం హర్షనీయమన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా అశ్విని కుమార్

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీ ఈఓ అశ్విని కుమార్‌కు శిరివెళ్ల మండల డిప్యూటీ ఎంపీడీఓ2గా బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపిడిఓ సి.శివ మల్లేశ్వరప్ప తెలిపారు. ఉన్నత విద్యావంతులు విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా నిజాయితీకి నిలువుటద్దంగా చురుకుగా పనిచేసే అశ్విని కుమార్‌ను అధికారులు గుర్తించి మండల డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. అశ్విని కుమార్ మాట్లాడుతూ శిరి వెళ్ల మండలంలోని ప్రతి ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమన్వయం చెందుతూ ప్రభుత్వం గ్రామ వార్డు సచివా లయాల ద్వారా ప్రవేశపెట్టే అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తానని అన్నారు.

పాఠశాల బస్సులు తనిఖీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రైవేట్ పాఠశాలల మరియు కళాశాలల విద్యార్థుల కోసం వెళ్లే బస్సుల భద్రతా చర్యలలో భాగంగా నంద్యాల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ నాయక్ మంగళవారం బస్సులను తనిఖీ చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో తాలూకాలోని ప్రైవేటు పాఠశాలల మరియు కళాశాలలకు చెందిన 60 బస్సులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైవర్, క్లీనర్లతో ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవరు మద్యపానం సేవించకుండా బస్సులు నడపాలని అత్యవసర ద్వారాన్ని కచ్చితంగా పని చేసేలా ఉంచుకోవాలని, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, స్పెషల్ లైట్లు కచ్చితంగా ఉంచుకోవాలని ఆదేశించారు

నేడు ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: నేడు మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు మండల స్థాయి క్రీడా పోటీలు మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్నామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కార్యదర్శి స్వామన్న యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో సోమన్న యాదవ్ మాట్లాడుతూ పురుషుల విభాగంలో క్రికెట్ పోటీలు, మహిళలకు త్రోబాల్ పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు. మండల స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన వారికి ఈనెల 13 నుంచి 15 వ తేదీ వరకు జరుగు ఆత్మకూరు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనదలచిన వారు ఈ సెల్ నెంబర్ 9563461555కి ఫోన్ చేయాలని కోరారు.

కుబేరులకే కుచ్చు టోపి

విశాలాంధ్ర-డోన్ : డబ్బుంటే ఆశా.. డబ్బు కోసం మనిషి ఎలాంటి పనులకైనా ఈ కాలంలో పునుకుంటున్నాడు. కొంత మంది డబ్బు ఆశతో వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటుండగా, మరికొంత మంది డబ్బు సులువుగా సంపాదించడానికి మార్గాలు వెతుకుతున్నారు. సమాజంలో హంగు, ఆర్భాటం చూపిస్తూ.. వ్యాపారాలు చేస్తున్నట్లు నమ్మిస్తూ, డబ్బులు ఈజీగా సంపాదిస్తున్నారు. వ్యాపారల్లో తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వచ్చే రియల్ ఎస్టేట్‌ను అడ్డుగా చూపిస్తూ, కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. ఈ మధ్య కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి డోన్‌లో 20 కోట్లు కుచ్చు టోపీ పెట్టరు. అది పట్టణంలో మరువక ముందే.. తాజాగా మరో వ్యాపారి ఏకాంగా డోన్ ప్రము ఖులకు రూ.230 కోట్లకు పైగా అప్పులు చేసినట్లు తెలుస్తోంది.

రూ.230 కోట్లకు టోకరా : డోన్ పట్టణంతో పాటు కర్నూలు తదితర ప్రముఖులకు భారీ టోకరా పడింది. తుగ్గలి మండలంలోని పెండెకల్లు గ్రామానికి కూతవేటు దూరలో ఉన్న గ్రామానికి చెందిన వ్యక్తి డోన్ ఓ బ్యాంకులో పనిచేస్తు రిటైడ్ అయ్యారు. డోన్‌లో నివాసముంటున్నారు. అతని కుమారుడు బెంగుళూరులో ఉంటూ, బెంగుళూరు, గోవాతో పాటు పలు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూన్నట్లు అందరిని నమ్మించాడు. వ్యాపారాల్లో భాగ స్వామ్యం ఉండాలని కోరడం, లేకుంటే పెట్టుబడికి అప్పు లు తీసుకోవడం ఇలా అందరిని నమ్మించినట్లు తెలు స్తోంది. పట్టణానికి చెందిన ప్రముఖ రాజకీయ నేతలు, పేరొందిన న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, వైద్యులు నుంచి సుమారు 230 కోట్లరూపాయలు వసులు చేసి, గ్రీన్ కార్డు తీసుకుని అమెరికాకు వెళ్లినట్లు తెలుస్తోంది.

మోసపోవడం డోన్ ప్రజలకు అలవాటే : మోసం చేయడం ఎంత తప్పో, మోసపోవడం అంతే తప్పు అని ఓసినిమాలోని డైలాగ్ ఇది.. ఈ డైలాగ్ బాగా సుటైంది డోన్ ప్రజలకు.. గతంలో కర్నూలకు చెందిన రమణ, వెల్దుర్తి దగ్గర పలు ఫ్యాక్టరీలు నిర్మిస్తున్నట్లు అందరిని నమ్మించాడు. డోన్‌లో ప్రముఖ రాజకీయ నాయకులు, అప్పుడు డోన్‌లో పనిచేస్తున్న సీఐ, ఎస్ఐలు, వ్యాపార వేత్తల నుంచి అప్పట్లో లక్షలు వడ్డీకి తీసుకుని ఎగనామామం పెట్టాడు. రమణతో మొదలుకుని ఇప్పటి వరకు సంవత్సరానికి ఒకరు చొప్పున చీటీల రూపంలో ఎక్కువ వడ్డీ ఆశల రూపంలో ఐపీలు పెడుతూనే ఉన్నారు. ఆయునప్పటికి డోన్ ప్రజలు డబ్బు ఆశతో నమ్మి మోసపోతూనే ఉన్నారనడంలో అతియోశక్తి లేదు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర- ప్యాపిలి: అరటి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. మండలంలోని హుసేనాపురం, చంద్రపల్లి, పీఆర్ పల్లి గ్రామాల్లోని అరటి తోటలను మంగళ వారం ఆయన పరిశీలించారు. చంద్రపల్లె నుంచి పిఆర్ పల్లె వరకు దాదాపు 8 కిలోమీటర్లు వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో అరటి తోటలను పరిశీలించి రైతుల కష్టసుఖాలను తెలుసుకున్నారు. అనంతరం పీఆర్ పల్లిలో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి బుగ్గన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గిట్టుబాటు ధర లేక టమాటా, ఉల్లి, మొక్కజొన్న, అరటి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్యాపిలి మండలంలో వేలాది ఎకరాల్లో రైతులు అరటి తోటలు వేశారని గత కొద్దిరోజులుగా అరటి ధర కిలో 50 పైసలకు పడిపోయిందన్నారు. దీంతో రైతులు అరటి ని తోటలోనే వదిలేస్తున్నారని ఆయన అన్నారు. గత వైసీపీ హయాంలో కరోనా కష్ట కాలాల్లోనూ అరటికి గిట్టుబాటు ధర కల్పించామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అరటి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, భరత్ రెడ్డి, గజేంద్రనాథరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సొమ్ము దుర్వినియోగంపై ఆగ్రహం

విశాలాంధ్ర - నందికొట్కూరు : మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్య తీరు వారి పని విధా నంపై మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి చెందిన ట్రాక్టర్ టైర్ పాడై చిన్నపాటి మరమ్మతులతో పని అయ్యే విషయాన్ని అధికారులు పట్టించుకోకుండా, అనవసరంగా ప్రైవేటు ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకొని నెలకు రూ.40 వేలకు పైగా చెల్లిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మంగళవారం విలేకరులకు తెలియజేశారు. ప్రజల డబ్బును వృథా చేసే విధంగా అధికారులు పనిచేయడం అస హ్యం కలిగించే విషయమని మున్సిపాలిటీకి చెందిన వనరులను సక్రమంగా విని యోగించకుండా, ప్రభుత్వ నిధులను అశ్రద్ధగా ఖర్చు చేస్తున్న అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాంటి అనర్థక నిర్ణయాలను భవిష్యత్తులో సహించబోమని, ప్రజల సొమ్ము ప్రజలకే ఉప యోగపడేలా ఎంపీ బైరెడ్డి శబరి సహకారంతో మున్సిపాలిటీ పరిపాలనను ముందుకు సాగేందుకు కృషి చేస్తానని చైర్మన్ అన్నారు. ఈయనతో పాటు మున్సిపల్ కౌన్సిలర్‌లు పి.చాంద్ బాష, లాలూ ప్రసాద్, సప్లయర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - చాగలమర్రి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం జీవయ్య,పీడీ శ్రీనాథరెడ్డిలు తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో వారు మాట్లాడుతూ గత నెల 27 నుండి 30 వరకు ఆహెూబిళంలో జరిగిన 69వ బేస్ బాల్ రాష్ట్రస్థాయి క్రీడలలో అత్యంత ప్రతిభ కనబరచి ఉన్నత పాఠశాల నుండి అండర్ 17 విభాగంలో నిరంజన్, చిత్తూరు జిల్లా పలమనేరు నందు జరిగిన అండర్ 14 విభాగంలో శ్రీ వెంకట సుశాంత్ లు జాతీయస్థాయిలో ఎంపికయ్యారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, పీడీలు శ్రీనాదరెడ్డి, ఆశాజ్యోతిలను హెచ్ఎం జీవయ్య, ఉపాధ్యాయులు ఐడి కృష్ణ శాస్త్రి, మహబూబ్ బాష, నారాయణమూర్తి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర బృందం అభినందించారు.

నంద్యాలలో దారుణ హత్య

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణంలోని స్థానిక హరిజనవాడలో నివాసం ఉంటున్న పెద్దన్న (20) రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. పెద్దన్న అన్న, వదినలు గొడవపడుతుండగా అడ్డు వెళ్లినందుకు కోపానికి గురైన వదిన మహాలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి మరిదిని దారుణంగా కత్తులతో పొడిచి చంపించింది. హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు రాగా, అప్పటికే పెద్దన్న మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు కేసు నమోదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో పెద్దన్న స్నేహితుడు ఉప్పరపేటకు చెందిన సురేష్‌ను సైతం కత్తులతో పొడవగా అతన్ని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. సురేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు డాక్టర్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీపై వచ్చిన జేఎల్ఓకు ఘన సన్మానం

విశాలాంధ్ర - వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామ పశు వైద్యశాల జేఎల్వోగా పదోన్నతిపై వచ్చిన సుబ్బలక్ష్మిని మంగళ వారం ఘనంగా సన్మానించారు. కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామీణ పశు వైద్యశాల నందు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్గ పని చేయుచున్న సుబ్బలక్ష్మి, వెలుగోడు మండలంలోని వేల్పనూరు గ్రామానికి వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్గ పదోన్నతి పై వచ్చారు. ఈ సందర్భంగా వెలుగోడు పట్టణంలోని పశు వైద్యశాల నందు జరిగిన కార్యక్రమంలో ఏడి వెంకటేశ్వర్లు అధ్య క్షత వహించారు. ఆత్మకూరు పశు వైద్యశాల విహెచ్‌లు వీడ్కోలు పలకగా, వెలుగోడు పశువైద్యశాల ఏవీహెచ్ లు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కిషోర్ కుమార్, అనూష, జోష్ణ శ్వేత అరుణ భాస్కర్ అంబులెన్స్ డాక్టర్లు, జేవిహోలు లక్ష్మీనారాయణ సునీలు సాయి మురళి, ఆంజనేయులు వీఎల్ఓ, ఏహెచ్ ఎలు, గోపాలమిత్ర మధు కుమార్, బాల వెంకటరమణలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సు డ్రైవర్లకు సూచనలు

విశాలాంధ్ర-గడివేముల: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి పాఠశాల యందు స్కూల్ బస్సు డ్రైవర్లకు జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి సుబ్బయ్య తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు గురించి తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం అందరి బాధ్యత అని ట్రాఫిక్ సింగాల్సిన పాటించాలని వేగ పరిమితులకు లోబడి డ్రైవింగ్ చేయాలని ఆయన అన్నారు. వాహనం నడిపేటప్పుడు డ్రైవర్లు సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడవ రాదని, ఓవర్ స్పీడుగా వాహనాలు నడపకూడదని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్‌లో మాట్లాడడం ఇతరులతో మాట్లాడము చేయకూడదు అన్నారు. కూడళ్ల వద్ద సిగ్నల్స్ తప్పనిసరిగా అనుసరించి నియంత్రిత వేగంతో వాహనాన్ని నడపాలన్నారు. ఫిట్నెస్ రెన్యువల్ సర్టిఫికెట్స్ పొల్యూషన్ సర్టిఫికెట్ డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రమాదపు ప్రాంతాలలో మలుగు ప్రాంతాలలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు చాలా జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత డ్రైవర్ క్లీనర్దే అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం రామేశ్వర రావు, ఏవో ఎంబిఎన్ రాఘవేంద్రరావు మరియు డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మచ్చ తెస్తున్న మున్సిపల్ అధికారులు



విశాలాంధ్ర - నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ తెచ్చే విధంగా నందికొట్కూరు పురపాలక సంఘం అధికారులు పని చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి వారిపై మండిపడ్డారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్నటువంటి మారుతి నగర్, హాజీ నగర్ కాలనీ ప్రజలు కష్టం చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని, అయితే కాలనీ ప్రజలు స్థానిక కౌన్సిలర్ లాలు తో కలిసి నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరిని కలసి మాకు కమ్యూనిటీ హాల్ కావాలని ఇక్కడ అంతా పేద ప్రజలమని అడగగా ఎంపీ శబరి ఎంపీ నిధులతో నవంబర్ 9న రూ.10 లక్షల మంజూరు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ అధికారులు ఆ రెండు ఏరియాలలో ప్రభుత్వ స్థలం లేదని, కొందరి స్వార్థ నాయకుల మాటలు విని తప్పుడు రిపోర్టు ఇచ్చి జాప్యం చేయడంతో ఎంపీ నిధులు వెనక్కి వెళ్లిపోవడం జరిగిందన్నారు. మారుతి నగర్, హాజీ నగర్ లో ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ ఎంపీ బైరెడ్డి శబరికి మంచి పేరు వస్తుందనే నెపంతో మున్సిపల్ అధికారులు నందికొట్కూరు పట్టణ అభివృద్ధికి నష్టం కలిగించడం దారుణమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో మహిళా ఎంపీగా బైరెడ్డి శబరి రాష్ట్ర అభివృద్ధికి బాగా పని చేస్తున్నారని ఒకపక్క చెబుతున్నప్పటికీ ఇక్కడి అధికారులు వారి నిర్లక్ష్యంతో ఎంపీ నిధులను వెనక్కి పంపించడం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఉందన్నారు. మారుతి నగర్, హాజీ నగర్ లో ఐదువేల జనాభా ఉన్నప్పటికీ అక్కడి ప్రజలకు సిసి రోడ్లు, తాగునీటి వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఈ విధంగా పట్టణ అభివృద్ధికి నష్టం కలిగించేలా చేయడం పద్ధతి కాదని ఇప్పటికైనా స్థలం కోసం రీ సర్వే చేయాలని లేదంటే ప్రజలతో కలిసి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లాలు ప్రసాద్, కౌన్సిలర్ చాంద్ బాషా, సప్లయర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర - సంజామల : మండలంలోని గవర్నమెంట్ హై స్కూల్‌లో మండల స్థాయిలో ఉపాధ్యాయులందరికీ ఆటలపోటీలు మండల విద్యాశాఖాధికారి రమణ రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్, త్రో బాల్ గేమ్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఎంపీడీవో సాల్మన్ ఆధ్వర్యంలో ఆటలపోటిలను ప్రారంభించి ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆటల పోటీలకు మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుండి ఉపాధ్యాయులు పీడీలు, సిఆర్ఎంటి హుసేన్ బాష పాల్గొన్నారు.

మండల మహా సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: ఈ నెల 11న నిర్వహించే ఏఐటియుసి మండల మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న ఆశా కార్యకర్తలను ఆశా డే సందర్భంగా ఆయన కలిసి వారి సమస్యలపై, జీతభత్యాలు, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల్లో లోపాలను తెలుసుకున్నారు. మహేష్ మాట్లాడుతూ ఆరోగ్య రంగానికి ఆశా కార్యకర్తలు కీలకమన్నారు. ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్క రిస్తామన్నారు. ఈనెల 11న జరిగే ఏఐటీయుసి మండల మహాసభకు కార్మికులు ఆశ కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

కాశిరెడ్డి నాయన ఆరాధన ఉత్సవాల సందర్భంగా గాడిద పందెములు

విశాలాంధ్ర - సంజామల : మండల కేంద్రంలోని ముక్కమల్ల గ్రామం అలికొండ క్రాస్ రోడ్డు వద్ద వెలసిన కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఈ నెల ఆరో తేదీ నుండి ఆరాధన ఉత్సవాలు ప్రారంభిస్తారని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. చుట్టుపక్కల మండలాలే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా భక్తులు ఈ ఆరాధన ఉత్సవాల్లో భారీగా పాల్గొంటారని తెలిపారు. ఈ నెల ఆరో తేదీ గాడిద పందాలు నిర్వహిస్తారని, ఈ గాడిద పందాలలో పాల్గొనటానికి ముం దస్తుగా ప్రతి ఒక్కరూ 500 రూపాయల రుసుము చెల్లించి పోటీలలో పాల్గొనాలని ఈ పందాలలో 80 పళ్ళ ఇసుక మూటను గాడిద మీద వేయవలెనని ఈ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండవ బహుమతిగా రూ.12 వేలు, మూడవ బహుమతిగా రూ.7 వేలు, నాల్గవ బహుమతిగా రూ.5,500, ఐదవ బహుమతిగా రూ.3 వేలు ఇస్తారని కార్యక్రమ నిర్వాహకులు పోచ శంకర్ రెడ్డి, చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాధికారి శ్రీధర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు, ఉపాధ్యాయనీలకు త్రోబాల్ పోటీలను నిర్వహించామని అన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు డివిజన్ స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి2 వెంకటేశ్వర రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల ఎల్వోసీ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రానికి చెందిన గాజుల రిజ్వాన్ అనే యువకునికి రెండు కిడ్నీలు డ్యామేజ్ అయిన డయాలసిస్ పేషెంట్‌కు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ రూ.10 లక్షల ఎల్ఓసి చెక్కును అందజేసినట్టు టిడిపి నేత బీసీ ఫిదా హుస్సేన్ తెలిపారు. మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం ప్రభుత్వాన్ని ఆర్థిక సహాయం కోరగా సీఎం చంద్రబాబుతో మాట్లాడి రూ.10 లక్షల ఎల్ఓసీ చెక్కును ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంజూరు చేయించినట్లు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటి అభివృద్ధికి సహకరించాలని అనంతపురం రీజనల్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయాన్ని మంగళవారం అనంతపురం రీజనల్ డైరెక్టర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీజనల్ డైరెక్టర్ కార్యాలయానికి చేరుకోగానే కమిషనర్ కిషోర్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంకుగాను అన్ని మున్సిపాలిటీలలో ఆస్తి పన్నులు, శానిటేషన్‌పై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాధారణ పరిశీలన లో భాగంగా ఇక్కడికి రావడం జరిగిందన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరించాలని రీజనల్ డైరెక్టర్ నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

ఈ నెల 10న రైతుల మహా రోడ్డు దిగ్బంధనం

విశాలాంధ్ర - ఆస్పరి : రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అధిక వర్షాలు, తుఫాన్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ నెల 10న ఆస్పరిలో భారీ రోడ్డు దిగ్బంధన నిరసన నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బి.గిడ్డయ్య పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో అధిక వర్షాలు, తుఫాన్ల కారణంగా ఉల్లి, టమోటా, పత్తి, వేరుశనగ వంటి పంటలను రైతులు సాగు చేసి తీవ్రంగా నష్టపోయారన్నారు. పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, సీసీఐ పేరుతో ప్రభుత్వం విధిస్తున్న కఠిన షరతుల కారణంగా రైతులు పత్తిని అమ్ముకోలేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి పంటను క్వింటాకు రూ. 12 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, సీసీఐ ద్వారా 12శాతం తేమ పరిమితిని 20 శాతానికికి పెంచాలని, అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు హామీ ఇవ్వాలని, వర్షాలతో నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న జరుగు భారీ రోడ్డు దిగ్బంధన నిరసన కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతున్నారని తెలిపారు. కావున రైతులు, ప్రజలు, కార్మికులు, పార్టీ శ్రేణులందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమేష్, సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, ఆంజ నేయ, ఉరుకుందప్ప, రామాంజనేయ, కృష్ణ, రాజశేఖర్, వీరేష్, జయరాముడు, హనుమంతు, రామాంజనేయులు, మల్లన్న, దస్తగిరి, తిక్కయ్య, హేమంతు, వీరన్న, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు లక్ష్మన్న, శేఖర్, సుంకన్న, బోరోడి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాగా ప్రకటించేంత వరకు ఉద్యమమే

విశాలాంధ్ర - ఆదోని రూరల్: రెండవ ముంబైగా పేరుగాంచిన ఆదోని డివిజన్ కేంద్రాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించేంత వరకు ఉద్యమం ఆగదని సిపిఐ పట్టణ కార్యదర్శి టి.వీరేష్ తెలిపారు. ఆదోని జిల్లా సాధన కోసం జాయింట్ యాక్షన్ కమిటీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 17వ రోజుకు చేరుకున్నయి. మంగళవారం ఆటో డ్రైవర్స్ మరియు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టి.వీరేష్,తిక్క స్వామి, రామకృష్ణ గౌడ్, చిట్టిబాబు, నరసింహులు, ఈరన్న, చంద్రశేఖర్, మురళి, శేఖర్, రాఘవేంద్ర, వెంకటేష్, రమేష్ గౌడ్,ప్రేమ్ కుమార్, శివరాజ్, లింగప్ప, షేక్షావలి, శ్రీనివాసులు, జిలాని ఆదోని జిల్లా సాధన కోసం దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి టి.వీరేష్ మాట్లాడుతూ ఆదోని ప్రాంతంలో ఐదు నియోజకవర్గాలుతో కలిపి ఆదోనిని జిల్లా చేసినట్లయితే మా ప్రాంతంలో ముందుగా వలసల నివారణ జరుగుతుందని,మా పిల్లలకి నాణ్యమైన విద్య అందుతుంది, నాణ్యమైన వైద్యం అయిదు నియోజకవర్గాల నిరుపేద ప్రజలకు అందుతుందన్నారు. డిగ్రీలు చదివిన ఐదు నియోజకవర్గాల నిరుద్యోగులకు వారి ప్రాంత పరిధిలోనే ఉపాధి కలుగుతుంది, నూతన పరిశ్రమలు ఏర్పడతాయి, చిన్నపాటి వర్షానికి ఆదోని మునిగిపోకుండా చేసుకోవడానికి రోడ్లు విస్తీరణ జరుగుతుందన్నారు. కలెక్టర్, ఎస్పీ ఆఫీసుల్లో న్యాయం కోసం 150 కిలోమీటర్ల ప్రయాణం తగ్గుతుందన్నారు. ఆరోగ్య సమస్యలతో కర్నూలుకు అంబులెన్స్ లో వెళ్తున్న మార్గంలో మరణాల సంఖ్య తగ్గుతుందన్నారు. భూ కబ్జాలు తగ్గుతాయి, నీటి ప్రాజెక్టులో నిర్మాణం జరుగుతుంది, గ్రామాల్లో ఏదైనా అత్యవసరమైన పని కలెక్టర్ ఆఫీసులో అవసరం పడినట్లయితే దానికోసం వ్యాయాప్రాయాసాలు పడి ప్రయాణం చేయవలసిన అవసరం లేకుండా ఉదయం 11 గంటలలోపే కార్యాలయానికి చేరుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఐదు నియోజకవర్గాల అభివృద్ధి జరిగినట్లయితే బైక్ యాక్సిడెంట్లు, కార్ యాక్సిడెంట్లు లో చాలామంది ప్రాణాలు కోల్పోయి చాలా కుటుంబాలు నిరస్రాలైనాయన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఆలోచన చేసి ఆదోని జిల్లా ప్రకటన చేయాలని రిలే నిరాహార దీక్షగా డిమాండ్ చేశారు.చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలపడానికి ఆదోని నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి బుట్టా రేణుక మరియు ఎంపిటిసి,జడ్పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు కలిసి వచ్చి సంఘీభావం తెలపడం

జరిగింది. అదేవిధంగా విద్యార్థి సంఘం మాజీ నాయకులు చిరుమన్ దొడ్డి మల్లికార్జున వారితో పాటు మిత్ర బృందం కలిసి వచ్చి దీక్షలో కూర్చున్నటువంటి ఆటో డ్రైవర్ మరియు వర్కర్స్ యూనియన్ నాయకులకు సంఘీభావం తెలిపారు. పిఓడబ్ల్యు మహిళా నాయకులు మణమ్మతో పాటు సీనియర్ లీడర్లు మల్లికార్జున, లక్ష్మన్న వారి కార్యకర్తలను తీసుకువచ్చి రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు.

లింగంపల్లిలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని లింగంపల్లిలో మంగళవారం ఎం.సిద్ధప్పకు చెందిన ఇంటి ఆవరణంలో నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల పత్తి అగ్నికి ఆహుతి అయిందని బాధితుడు సిద్ధప్ప తెలిపారు. మధ్యాహ్నం సమయంలో ఇంటిలోకి వెళ్లి భోజనానికి కూర్చున్నామని అంతలోపలే పత్తి కి నిప్పంటుందని అన్నారు. ప్రజలు పత్తిని నీటితో ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కౌలు చేసి పండించిన పత్తి 30 కింటాళ్లు కాలిపోయి రూ. 2.50 లక్షలు ఆర్థిక నష్టం మిగిల్చిందని బాధితుడు సిద్ధప్ప బోరున ఏడ్చారు. రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఆర్థిక సహాయం చేయాలని మాల మహానాడు నాయకులు మల్లికార్జున కోరారు.

నూతనంగా ఎస్టీయూ మండల శాఖ ఏర్పాటు

విశాలాంధ్ర - కౌతాళం: మండలంలో నూతనంగా ఉపాధ్యాయ ఎస్‌టియు మండల శాఖను రాష్ట్ర కార్యదర్శి బి.నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చిన్న సుంకన్న ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడిగా ఆంజనేయ, ప్రధాన కార్యదర్శిగా పి.హాజర్ బాష, ఆర్థిక కార్యదర్శిగా కె.పరమేష్, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన శాఖను మండల విద్యాధికారిణి శోభారాణిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జిల్లా కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మండల విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, గురురాజా, మౌనేష్, ఈరన్న, ఆనందరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లార్తిలో భక్త కనకదాసుడి విగ్రహ ప్రతిష్టాపన

విశాలాంధ్ర - హొళగుంద: ఎల్లార్తిలో 4 తేదీన భక్త కనకదాసుడి విగ్రహ ప్రతిష్టాపనకార్యక్రమం జరుగుతోందని భక్తులు మంగళవారం తెలిపారు. ప్రతిష్టాపన కార్యక్రమం సిద్ధ రామ నందస్వామి తింతిని బ్రిడ్జ్ కాగినెలె మఠం, గోవర్ధనానంద స్వామి దమ్మూరు లింగేశ్వర, బనశంకరి శక్తి మఠం స్వామి వారిచే విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరుగుతుందని ఉదయం 9 నుండి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి భక్తులు మాదాసి మాదారి కురువ కుల బాంధవులు, ప్రజా ప్రతినిధులు అందరూ తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

స్నేహితుల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామానికి చెందిన జిలకర పులిరాజు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతుని 2008 బ్యాచ్ కు చెందిన పూర్వపు పదోతరగతి స్నేహితులు పులిరాజు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం తక్షణ సహాయంగా రూ. 16500 నగదును భార్య జ్యోతికి అందజేశారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని స్నేహితులు భరోసా ఇచ్చారు.

తప్పిపోయిన విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

విశాలాంధ్ర- క్రిష్ణగిరి: తప్పిపోయిన ఎస్సీ హాస్టల్ విద్యార్థి ఆచూకీ తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై కృష్ణమూర్తి, వార్డెన్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ ఎస్సీ హాస్టల్లో ఉంటున్నాడన్నారు. సోమవారం కంబాలపాడు ఎస్సీ హాస్టల్ విద్యార్థి బండ అంజి ఆడుకోవడానికి బయటకు వెళ్లి అదృశ్యం అయ్యాడని వార్డెన్ వెంకటేశ్వర్లు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టమన్నారు. ఈ దర్యాప్తులో భాగంగా డోన్ రైల్వే స్టేషన్ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో విచారించగా 44వ జాతీయ రహదారిలో భారత్ హొటల్ దగ్గర రాత్రి దొరికారన్నారు. ఎందుకు వెళ్లావని విద్యార్థిని విచారించగా బడికి వెళ్లడం ఇష్టం లేదని తెలిపారు అన్నారు. డోన్ మండలం వెంకట్ నాయన పల్లెలో గ్రామానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి, విద్యార్థిని వారికి అప్పగించినట్లు ఆయన తెలిపారు. అదృశ్యమైన విద్యార్థి మిస్సింగ్ కేసుపై క్రిష్ణగిరి తాసిల్దార్ ఎదుట హాజరు పరిచారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురి మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-గూడూరు: కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరు నగర పంచాయతీకి చెందిన చంద్రబాబు(32), గనమల సుమన్(31) అనే ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక వివరాల ప్రకారం కర్నూలు పట్టణం సంతోష్ నగర్ హైదరాబాద్ జాతీయ రహదారిపై ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా టిప్పర్ ను ఓవర్ టేక్ చేసే సమయంలో ఈప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కోడుమూరు నియోజకవర్గం గూడూరు కు చెందిన చంద్రబాబు, గనమాల సుమన్ అక్కడికక్క మృతిచెందగా నవీన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. నవీన్ అనే వ్యక్తిని చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి ట్రాఫిక్ పోలీసులు, నాలుగో పట్టణ పోలీసులు వెంటనే చేరుకోని సహయక చర్యలు చేపట్టారు. ఈప్రమాదం సందర్భంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని థర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు : ఈ నెల 4 వ తేదీ ఎమ్మిగనూరు పట్టణంలోని తెరు బజార్ నందున్న మంజునాథ మినీ ఫంక్షన్ హాల్లో జరిగే ఏపీ మహిళా సమాఖ్య జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిఆర్ భవన్ నందు ఏపీ మహిళా సమాఖ్య నగర ముఖ్య నాయకులు సమావేశం నగర కార్యదర్శి వి.భారతి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో పాల్గొన్న గిడ్డమ్మ శ్రావణిలు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబల్ ఇంజన్ సర్కార్ మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఎన్నికలకు ముందు మహిళలకు ఇస్తామన్న హామీలు పూర్తిగా అమలు చేయకుండా మాటలకే పరిమితమైందని వారు విమర్శించారు మహిళలకు ఉచిత బస్సు అని ఆర్భాటాలు చేస్తున్నారు తప్ప వారి అవసరాలకు అనుగుణంగా బస్ సర్వీసులు నడవడం లేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 1500 చొప్పున సంవత్సరానికి 18,000 ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దుర్గ భవాని పాల్గొంటున్నారని, ఈ సమావేశంలో మహిళల సమస్యల పైన చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణకు జనరల్ బాడీ సమావేశం వేదిక కానుందన్నారు. ఈ సమావేశంలో ఏపీ మహిళా సమైక్య జిల్లా ఉపాధ్యక్షురాలు రేణుక, నగర నాయకురాలు ప్రభావతి, సుధా, పావని, సులోచనమ్మ, ఆశా బేగం, తదితరులు పాల్గొన్నారు

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపాలి

విశాలాంధ్ర - కోడుమూరు : మండలంలో రహస్యంగా పెరుగుతున్న బెట్టింగ్, మట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు గౌడ్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో జరిగిన ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత చెడు అలవాట్ల బారిన పడుతూ జీవితాలు నాశనం చేసుకుంటున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై నిత్యం నిఘా పెట్టాలని శ్రీరాములుగౌడ్ సూచించారు. ఇంజనీరింగ్, మెడికల్ కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని గంజాయి ముఠాలు కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని, వీరిపై పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. క్రికెట్ మ్యాచ్‌ల సమయంలో ఆన్లైన్ బెట్టింగ్ అధికమైందని, కోడుమూరు పరిసర ప్రాంతాల్లో మట్కా జోరుగా సాగుతోందన్నారు. మట్కా వలన కొంతమంది ఉద్యోగులు,వ్యాపారవేత్తలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బయటకు చెప్పుకోలేక అంతర్మథనంలో ఉన్న వారిని గుర్తించి రక్షించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక దళాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు మునిస్వామి, అఖిల్, హరి, తరుణ్, కళాదర్, ఆంజనేయులు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

విశాలాంధ్ర - చిప్పగిరి: జిల్లాలో పదవ తరగతి విద్యార్థుల డ్రాప్ అవుట్ జీరో శాతం ఉండాలని, పది పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తూ పదో తరగతి లో డ్రాప్ ఔట్ అయిన విద్యార్థులు ఎంత మంది ఉన్నారనే విషయాన్ని కలెక్టర్ పాఠశాల ప్రధానోపా ధ్యాయులు లతీఫ్‌ను ఆరా తీశారు. పదోవ తరగతిలో డ్రాప్ ఔట్ అయిన విద్యార్థుల తల్లి దండ్రులతో మాట్లాడి వారిని ఒప్పించి, తిరిగి విద్యార్థులను పాఠశాలకు పిలిపించి పబ్లిక్ పరీక్షలకు దరఖాస్తు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రధానోపాధ్యాయును ఆదేశించారు. పదో తరగతి చదువును మానేసిన తేజకుమార్, రోహిణి విద్యార్థులతో కలెక్టర్ ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడుతూ పాఠశాలకు రావడానికి ఏమి సమస్య ఉంది, చదువుకుంటూనే జీవితం మారుతుం దని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశాలు ఉంటాయని తిరిగి పాఠశాలకు రావాలని కోరారు. జిల్లా కలెక్టర్ వెంట మండల స్పెషల్ ఆఫీసర్, మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ్ బాబు, డీఈవో సామ్యేల్ పాల్ ఉన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : ఎమ్మెల్యే మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తూ మరణించిన 13 మంది పారిశుద్ధ కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియమం కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని వైసీపీ జిల్లా పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. ఏఐటీయూసీఐ, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో చేపట్టిన 16వ రోజు కార్మికుల నిరాహార దీక్షలకు బుట్టా రేణుక పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలు తెగించి పనిచేసిన పారిశుద్ధ కార్మికుల సేవలను వెలకట్టలేనిది, ఎక్కడకు విపత్తు వచ్చినా వరదలు వచ్చినా పారిశుద్ధ కార్మికుల అక్కడికి వెళ్లి పని పనిచేయడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. అలాంటి పారిశుద్ధ కార్మికులకు విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యాలతో మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు మానవ దృక్పథం చూపించ కుండా రోడ్డుమీద కూచిపెట్టడం బాధాకరమని ఆమె అన్నారు.సిపిఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న, సిపిఐ (ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ) జిల్లా నాయకులు రాజు, ఏఐటీయూసీ నాయకులు తిమ్మా గురుడు విజయేంద్ర, మున్సిపల్ కార్మిక నాయకులు ఎల్లప్ప, శివకృష్ణ, ప్రతాప్, హరి ప్రసాద్, సల్మాన్, మునీంద్ర ఇస్మాయిల్, లక్ష్మన్న, అరిఫ్, సురేష్, వైసీపీ నాయకులు బుట్టా ప్రతుల్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరులో 5న ఏఐటీయూసి మహాసభ

విశాలాంధ్ర - గూదూరు: ఈ నెల 5న పట్టణంలో జరిగే ఏఐటియుసి మండల మహాసభను జయప్రదం చేయాలని ఏఐటియుసి నాయకులు బీడీల శ్రీనివాసులు, ఆటో ఓబులేసు తెలియజేశారు. మంగళవారం గూదూరు పట్టణంలో ఏఐటియుసి హమాలి యూనియన్ ప్రెసిడెంట్ లక్ష్మన్న అధ్యక్షతన మండల కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో ఏఐటీయూసీ జిల్లా మహాసభలో జరుగుతున్నాయని ఇందులో భాగంగా ముందుగానే గూడూరు మండలంలోని ఏఐటియుసి అనుబంధ సంఘాలైన ,హమాలీ కార్మికులు, ఆటో యూనియన్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని గూడూరు పట్టణంలో స్థానిక కొత్త బస్టాండ్ నుండి, ప్రజా నాట్యమండలి కళాకారులతో ,డప్పు నృత్యాలతో భారీ ఊరేగింపు నిర్వహించి పాత బస్టాండ్లో బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ బహిరంగ సభకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునియప్ప, కోడుమూరు నియోజకవర్గ ఇన్చార్జి నాయకులు లెనిన్ బాబు, ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో హమాలీలు మద్దిలేటి, శీను శివ, రైతు సంఘం నాయకులు మేకల మద్దిలేటి, ఆటో యూనియన్ నాయకులు బీడీల మద్దిలేటి, బాష, భవన నిర్మాణ సంఘం నాయకులు లక్ష్మన్న, చిన్న వ్యాపారస్ల సంఘం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణల్లో బాధితులకు పూర్తి న్యాయం

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : నగరంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనుల్లో భూమి, భవనాలు కోల్పోయే బాధితులందరికీ పూర్తి స్థాయి న్యాయం చేస్తామని కమిషనర్ తెలిపారు. నగరపాలక కార్యాలయంలో కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు (ఆర్డీపి-2), చెక్‌పోస్ట్ నుండి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు రహదారి విస్తరణ పురోగతిపై పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయడానికి అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాధితులకు ట్రాఫిక్ నియంత్రణకు రహదారుల విస్తరణ ఆవశ్యకతను వివరించి, యాజమాన్య పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణలో ప్రభావితమవుతున్న 82 ఆస్తుల యజమానులతో మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఎన్‌హెచ్-340సి రహదారి విస్తరణకు సంబంధించిన 201 ప్రభావిత ఆస్తుల యజమానులతో ఇరువైపులా సమగ్రంగా మాట్లాడి, వారి సందేహాలను నివృత్తి చేయాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నగరాభివృద్ధికి ప్రజల సహకారం కీలకం కాబట్టి, స్వచ్ఛంద సహకారం అందిస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని కమిషనర్ అన్నారు.

కేజీబీవీ పాఠశాల అభివృద్ధే లక్ష్యం : స్కూల్ చైర్మన్

విశాలాంధ్ర - నందవరం: కస్తూరిబా గాంధీ పాఠశాల అభివృద్ధే లక్ష్యమని విద్యా కమిటీ చైర్మన్ భీమన్న అన్నారు. పాఠశాలలో నూతన వాలీబాల్ గ్రౌండ్‌ను పిఈటి శిరోమణి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మండల వైద్యాధికారిణి శ్రీలేఖ, ఏవో సరిత, జనసేన మండల అధ్యక్షులు పెద్ద ఎల్లప్ప, తుగ్గలి ఈరన్న గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రవి, వైస్ చైర్మన్ సునీతలు పాల్గొని, రిబ్బన్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆటలు కూడా ముఖ్యమని, మానసిక సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రశాంతమైన వాతావరణంలో క్రీడలు ఆడాలన్నారు. విద్యార్థులు క్రీడారంగంలో అభివృద్ధి చెందాలని, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసము, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. స్కూల్ అభివృద్ధికి మరింత సహాయాన్ని అందిస్తామన్నారు. గ్రౌండ్ నిర్మాణానికి నజనసేన మండల అధ్యక్షులు రూ. 18 వేలు, సాఫ్ట్ వేర ఇంజనీర్ నల్లంగి నాగరాజ్ రూ. 10 వేలు, టిడిపి నాయకులు బోయ వీరేష్ రూ. 4వేలు, ఎల్ఐసి తుగ్గలి ఈరన్న గౌడ్ రూ. 3వేలు, కోట వీధికి చెందిన కానిస్టేబుల్ లక్ష్మణ రూ. 2 వేలు, హెడ్ కానిస్టేబుల్ బి.రవి వెయ్యి రూపాయలు, విద్యా కమిటీ వైస్ చైర్మన్ సునీత రూ.2వేలు, విజయ్ 500, స్కూల్ చైర్మన్ బీమన్న తనవంతు సహాయంగా రూ. 8 వేలు ఇవ్వడం జరిగిందన్నారు.

పురోభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలి

విశాలాంధ్ర - కల్లూరు : కాన్వకేషన్ నిర్వహణలో చూపిన స్ఫూర్తిని కొనసాగిస్తూ విశ్వవిద్యాలయ పురోభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి.వెంకట బసవరావు పిలుపునిచ్చారు. వర్సిటీ సెనేట్ హాలులో మంగళవారం జరిగిన అధ్యాపకుల సమావేశంలో యూనివర్సిటీ నాల్గవ స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయడంలో శక్తివంచన లేకుండా కృషిచేసినందుకు అందరిని అభినందించారు. ఏదైనా ఓ గొప్ప కార్యక్రమం ముగిసిన తర్వాత అందులో భాగస్వాములైన ప్రతిఒక్కరిని గుర్తించి గౌరవించడటం భారతీయ సంప్రదాయమన్నారు. కాన్వకేషనుకు ప్రత్యక్షంగా హాజరైన రాష్ట్రగవర్నర్ మరియు వర్సిటీ ఛాన్సలర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ వర్సిటీ వర్గాలను హృదయ పూర్వకంగా ప్రశంసించారని తెలిపారు. ఐకమత్యంతో ఉంటూ ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించడం వల్లనే కాన్వకేషన్ విజయవంతమైందన్నారు. విద్యార్థులంతా తరగతులకు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చూస్తూ వారి ఉన్నతికి కృషి చేయాలన్నారు. వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పివి సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య సివి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర -కర్నూలు సీటీ : స్థానిక చంద్ర రాజేశ్వరరావు కాలనీలో మంగళవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్వనౌ సంస్థ డైరెక్టర్ సుప్రజిత్తు, పాస్టర్ జాకోబ్, సిపిఐ నగర కార్యదర్శి పి.రామ కృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి సి.మహేష్‌లు 50 మంది వృద్ధు లకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్వనౌ సమస్త ఈ కాలనీలో పేదలను గుర్తించి వారికి సేవ చేసే దాంట్లో భాగంగా వృద్ధులకు వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేయడం, భవిష్యత్తులో మెడికల్ క్యాంపులు వాటర్ సంబంధించి సప్లై చేయడం కార్యక్రమాన్ని చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అశోకు, శేషు మాణిక్యం పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు



విశాలాంధ్ర - నందవరం: మండల అధికార యంత్రంగం విశాలాంధ్ర కథనానికి స్పందించింది. ఈ నెల ఒకటో తేదీన విశాలాంధ్ర దినపత్రికలో 'దుర్వాసనమయం హాళహర్వి' అని శీర్షిక వెలువడింది. దీనికి మండల అభివృద్ధి అధికారి పుల్లయ్య స్పందించి గ్రామంలోని ఆదర్శ పాఠశాల దగ్గర జేసిబి, గ్రీన్ అంబాసిటర్ల కలిసి శుభ్రం చేసించి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట కాలువలల్లో పేరుకు పోయిన చెత్తాచెదారం ప్లాస్టిక్ కవర్లను తొలగించి, గ్రామంలో ప్రతి వీధిలో బ్లీచింగ్ చల్లడం జరిగింది. దీంతో గ్రామంలోని ప్రజలు, విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు ఎప్పుడు విశాలాంధ్ర ప్రజల సమస్యలను వెలికి తీస్తూ ప్రజల పక్షాన నిలబడాలని కోరుతూ విశాలాంధ్రకు కృతజ్ఞతలు తెలిపారు.

పడమటి కొండల్లో ఎర్రమట్టి తరలింపుపై విచారణ

విశాలాంధ్ర - సి.బెళగల్: బెళగల్ పరిసరాల్లో ఉన్న పడమటి కొండల్లో గత మూడు రోజులుగా కంపాడు గ్రామానికి చెందిన మట్టి మాఫియా రాత్రి వేళల్లో ప్రోక్లైన్లతో ఎర్రమట్టి త్రవ్వి కంపాడు గ్రామానికి ఎర్రమట్టి తరలించారు. ఈ ఎర్ర మట్టి తరలింపు విషయాన్ని కర్నూలులోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామానికి చెందిన వ్యక్తులు ఎర్ర మట్టి తరలించే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో స్పందించిన కలెక్టర్ సిరి వెంటనే తహసిల్దార్ వెంకటలక్ష్మి, గనుల శాఖ అధికారులకు యదేచ్ఛగా తరలిస్తున్న ఎర్ర మట్టి తరలింపుపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం ఈ విషయంపై గనుల శాఖ అధికారి ఏడి వెంక టేశ్వర్లు, తహసీల్దార్ వెంకటలక్ష్మి కొండల్లో ఎర్రమట్టి మాఫియా తరలించిన గుంతలను కొలతలు వేశారు. గ్రామంలో ఇళ్ళ ముందర ఉన్న ఎర్రమట్టి కుప్పలను అధికారులు పరిశీలించారు. ఈ మేరకు పడమటి కొండల నుండి కంపాడు గ్రామానికి ఎర్రమట్టి తరలించిన వైనంపై విచారణ జరిపి నివేదిక పంపుతున్నట్లు తాసిల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు.

అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకారాదు

విశాలాంధ్ర - పత్తికొండ: అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకారాదని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష విద్య విభాగం ఆధ్వర్యంలో అంగవైకల్య పిల్లలకు నిర్వహించిన ప్రత్యేక పరీక్షల క్యాంపుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్న పిల్లలను సమాజంలో ఒకరిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి వారి లోపాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, తల్లిదండ్రులు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా ప్రోత్సహించాలన్నారు. పరీక్షల ద్వారా వైకల్యాలను గుర్తించిన వారికి అవసరమైన పరికరాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ బి.ఎస్ లోకరాజు, జిల్లా సహిత కోఆర్డినేటర్ సురేంద్రబాబు జి, ఎంఈఓ లు రాజా రామ్మోహన్, గాజుల రమేష్, ఐఈఆర్టీలు శ్రీనివాసులు, తేజ కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 03, డిసెంబరు 2025

గర్భవతులను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర - చిప్పగిరి: ప్రసూతి మరణాలు, శిశు మరణాలు తగ్గించడానికి గర్భిణుల ముందస్తు గుర్తింపు కీలకమని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చిప్పగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి వార్డులను, మందుల గడువు తేదీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలోని ఓపీ రిజిస్టర్ ను పరిశీలిస్తూ ఎటువంటి కేసుల మీద ఇక్కడ ఎక్కువగా ప్రజలు వస్తుంటారనే విషయాన్ని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలు నమ్మకంగా వచ్చే ప్రదేశాలని రోగుల పట్ల సిబ్బంది మరింత శ్రద్ధ చూపి వైద్య సేవలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది అందరూ సమయానికి విధుల్లో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. గర్భవతుల రిజిస్టర్‌ను పరిశీలిస్తూ ఇక్కడ ఎన్ని డెలివరీలు అయ్యాయి అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఆశా వర్కర్లతో మాట్లాడుతూ గర్భవతులను 3 నెలల తర్వాత రిజిస్టర్‌లో నమోదు చేయకుండా, ముందుగానే గుర్తించి వెంటనే నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక ప్రమాద గర్భిణులను ప్రత్యేకంగా గుర్తించి వైద్య అధికారుల పర్యవేక్షణలో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.భాస్కర్ రాజు, మెడికల్ ఆఫీసర్ ఆఫ్రోజ్ జహాన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఐఏబీ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లా కేంద్రంలో నిర్వహించిన నీటిపారుదల సలహా మండలి సమావేశం రైతాంగ సమస్యలపై సీరియస్‌గా చర్చించలేదని, సిల్లీగా జరిగిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళ వారం నంద్యాలలో నిర్వహించిన ఐఏబీ సమావేశంలో రబీ సాగులో రైతంగం సాగు చేసుకున్న పంటలకు ఎంతవరకు నీళ్లు ఇస్తామనేది నీటిపారుదల శాఖ అధికా రులు స్పష్టత ఇవ్వలేదని భూమా అఖిల ప్రియ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగుగంగ ప్రాజెక్టు చైర్మన్ సంజీవకుమార్ రెడ్డి,సాగునీటి డిస్ట్రిబ్యూ టరీ కమిటీల డైరెక్టర్లతో కలిసి భూమా అఖిలప్రియ మాట్లాడుతూ తెలుగుగంగ ప్రాజెక్టు నుండి ఆళ్లగడ్డ చివరి ఆయకట్టు వరకు రబీసాగులో ఎంత వరకు పంటలకు నీళ్లు ఇస్తామనేది స్పష్టత ఇవ్వలేద న్నారు. 0 నుండి 150 కిలోమీటర్ల వరకు కేసికి నీళ్లు ఇవ్వలేమని అధికారులు చెప్పుతున్నారని మరి శ్రీశైలం నుండి బానకచర్ల ద్వారా ఇవ్వడానికి అవకాశం ఉన్నా వాటి గురించి సమావేశంలో చర్చించకపోవడం దారుణ మన్నారు. నీటి పారుదలపై అవగాహన లేని తెలుగుగంగ ఎస్ఈ, కెసి కెనాల్ ఈఈ ప్రతాప్ ను సస్పెండ్ చేయాలని, లేదా బదిలీ చేయాలని భూమా అఖిలప్రియ డిమాండ్ చేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో లక్ష ఎకరాల ఆయకట్టు ఉన్నా చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇచ్చామని, అధికార పార్టీలో ఉన్నా ఈ ఏడాది వర్షాలు అధికంగా పడినా అధికారులు నీళ్ళు వదలక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. నంద్యాల జిల్లాలోని ఇరిగేషన్ అధికారులకు అవగాహన లేదన్నారు. ఆళ్లగడ్డ నియోజక వర్గంపై చర్చ లేనప్పుడు మాకు సమాచారం ఇవ్వద్దని స్పష్టం చేశారు. నంద్యాల, ఆళ్లగడ్డ రైతుల గురించి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నంద్యాలలో జరిగిన ఐఏబి సమావేశం తీరును సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకుపోతున్నట్లు తెలిపారు.

జార్జియా, భారత్ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: భారత్, జార్జియా దేశాల మధ్య న్యూ ఢిల్లీలో మంగళవారం లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా నాయకత్వంలో జార్జియా ప్రతినిధి బృందంతో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. జార్జియా ప్రతినిధుల బృందానికి భారత్ తరుపున ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి బృందం స్వాగతం పలికారు. జార్జియా పార్లమెంటు ఛైర్మన్ షల్వా పాపువాష్విలి ఆయన ప్రతినిధి బృందం భారతదేశానికి వచ్చారు. రెండు దేశాలకు సంబంధించిన ద్వైపాక్షిక చర్చలలో కూడా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. చర్చల అనంతరం భారత విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్, జార్జియా ప్రతినిధులతో కలిసి లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా పాల్గొన్న ద్వైపాక్షిక చర్చలు భారత్, జార్జియా దేశాల సంబంధం బలోపేతం, ఉమ్మడి ప్రజాస్వామ్యం, విలువలు, సమీప భవిష్యత్ లో భారత్, జార్జియా దేశాల పార్లమెంటరీ స్నేహ సమూహాన్ని ఏర్పాటుకు, విస్తరిస్తున్న పార్లమెంటరీ బలోపేతానికి దోహదపడుతాయని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.

ఢిల్లీలో మంత్రి నారా లోకేష్‌ని కలిసిన ఎంపీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఢిల్లీలోని టీడీపీ పార్లమెంటరీ కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను మంగళ వారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమావేశాలలో పాల్గొంటున్న ఎంపీ, మొంథా తుఫాను ప్రభావం వలన రాష్ట్రంలో జరిగిన నష్టం అంచనా సమగ్ర నివేదికను కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్ కు అందించేందుకు వచ్చిన లోకేష్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు జిల్లా లో మొంథా తుఫాను వల్ల కలిగిన నష్టాన్ని లోకేష్‌కి వివరించారు.

రైతులు పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: వరి, జొన్న, మినుము పంటలకు బీమా చేయించుకుంటే దిగుబడి ఆధారంగా పంటల బీమా వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి హేమలత అన్నారు. మంగళవారం కురుకుంద గ్రామంలో వరిలో పంట కోత ప్రయోగానికి హాజర య్యారు. రైతు సేవ కేంద్రంలో రైతులకు పంట మార్పిడి మీద అవగాహన కల్పించారు. సందర్భంగా మాట్లాడుతూ 10వ పంటల భీమా వారోత్సవాలు డిసెంబర్ 1-7 వరకు జరుపుతున్నాము. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కార్యక్రమం గూర్చి మండల వ్యవసాయ అధికారి కురుకుంద గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. జొన్న పంటకు ఎకరానికి రూ.60లు ప్రీమియం చెల్లిస్తే రూ.18,800, మినుము పంటకు రూ.48 చెల్లిస్తే బీమా మొత్తం రూ.19వేలు వరి పంటకు ఎకరానికి రూ.126 ప్రీమియం చెల్లిస్తే రూ.42వేలు, శనగ పంటకు ఎకరానికి రూ.84 ప్రీమియం చెల్లిస్తే రూ.28వేలు పొందవచ్చని తెలియజేశారు. మినుము విబిఎన్-8, విబిఎన్-9, విబిఎన్-10 రకాలు మినీకిట్స్ రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్, విఏఏ షాజిద్ బాష, ఎంపిఈఓ ముర్తుజావలి పాల్గొన్నారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహించిన భూమి పూజకు బిజెపి రాష్ట్ర నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ప్రధాన కూడలి వద్ద వేద పండితుల మంత్రోచ్ఛారణతో కొబ్బరి కాయ కొట్టి భూమిపూజకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శత జయంతిని పురస్కరించుకొని నంద్యాలలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 13న అతిరథ మహారథుల సమక్షంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బిజ్జం సుబ్బారెడ్డి, కసెట్టి కృష్ణ మూర్తి, కసెట్టి చంద్రశేఖర్, తూము శివారెడ్డి, రమేష్, స్వామిరెడ్డి, యాలూరు నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన కుమారు ఇంజనీరింగ్ ఇండస్ట్రియల్ అధినేత తునికిపాటి దేవేంద్ర కుమార్ ఆచారి మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేరారు. మండల విశ్వబ్రాహ్మణ నూతన కమిటీ గౌరవ సలహాదారు అయిన తునికీ పాటి దేవేంద్ర కుమార్ ఆచారి తన మనవడు దేవాన్ ఆచారి నాలుగవ పుట్టినరోజు సందర్భంగా గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రూ.50 వేలు విలువ చేసే దుస్తులు పంపిణీ చేశారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యంగా ఉంటేనే విద్యా, క్రీడలపై దృష్టి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై, క్రీడలపై దృష్టి పెడతారని శాంతినికేతన్ విద్యా సంస్థల అధినేత సుధాకర్ అన్నారు. నంద్యాల క్రాంతి నగర్ శ్రీ శాంతినికేతన్ సిబిఎస్ఇ విద్యా సంస్థలలో మంగళవారం పాఠశాల అధినేత సూర్యదేవర సుధాకర్ ఆధ్వర్యంలో గ్రో అండ్ గ్లో డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రఫా హాస్పిటల్ అధినేత డాక్టర్ సుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ మాట్లాడుతూ నేటి కాలంలోని విద్యార్థులు ఆరోగ్యకరమైన, ఇంటిలో తయారు చేసుకునే ఆహార పదార్థాలను పక్కనపెట్టి బజార్లలో దొరికే విషపూరిత, రంగులతో కూడిన ఆహారం పట్ల ఆకర్షితులై ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు గ్రో అండ్ గ్లోగా ఉండాలి అంటే ఆరోగ్యకరమైన ఆహారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం లోపించకూడదు

విశాలాంధ్ర - మద్దికెర : గ్రామాల్లో పారిశుధ్యం లోపించకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. మంగళవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో, రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్య శాఖ, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా శాఖ, సంబంధిత మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ, త్రాగునీరు, వీధి దీపాలు, స్వర్ణ పంచాయతీ పోర్టల్ అప్డేషన్, గ్రామ సచివాలయం సిబ్బంది విధుల నిర్వ హణ, హాజరు, సంబంధిత అంశాల పై ఆరా తీశారు. పంచాయతీ ఐవిఆర్ఎస్ కాల్స్‌కు సంబంధించి ప్రజల నుండి సానుకూలత వ్యక్తం అయ్యేలా పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయానికి సంబంధించి రెండు, మూడు రకాల పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటికి సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళిక తో తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను వంద శాతం నీటితో నింపాలని ఆదేశించారు. యాస్పిరేషనల్ బ్లాక్ గా మద్దికెర మండలం ఉన్న నేపథ్యంలో వంద శాతం అభివృద్ధి సూచికలను పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల మండల స్థాయి క్రీడా పోటీలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు ఉపాధ్యాయుల మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. క్రీడా పోటీలను మండల విద్యాధికారి అబ్దుల్ కలాం, శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి గౌడ్, ఎస్ఐ గోపాల్, ప్రధానోపాధ్యాయుడు కొండప్ప కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ఉపాధ్యాయ, ఉపాధ్యాయినిలకు వేరువేరుగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీలలో పాల్గొనేందుకు ఆయా పాఠ శాలల పలువురు ఉపాధ్యాయులు రావడం సంతోషం కలిగిస్తుందని అన్నారు. ఉపాధ్యాయినిలకు త్రోబాల్, మూడు టీముల ఉపాధ్యా యులకు క్రికెట్ పోటీలను నిర్వహించగా 11 మందిని నియోజక వర్గస్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 13వ తేదీన నియోజవర్గ స్థాయి పోటీలలో, 14 జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని అనంతరం రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయ బృందం నాగరాణి, దివాకర్, సిఆర్పి రాజేష్, అకౌంటెంట్ కాంతారావు పాల్గొన్నారు.

మట్టి నమూనాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ నందు విద్యార్థులకు నేలమట్టి ఆరోగ్యంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళ వారం అవగాహన కల్పించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వ్యవసాయ శాస్త్రవేత్త హరిబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేల ఆరోగ్యం మట్టి పరీక్షలు తదితర వాటిపై విద్యార్థులకు తెలిపారు. మట్టిని ఎప్పుడు సేకరించాలి, పరీక్షలు ఎప్పుడు చేయించాలి, సాయిల్ హెల్త్ కార్డులు రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయో తదితరవాటినీ తెలిపారు. నేలలు ఎంతమేర సారవంతంగా ఉన్నాయి, ఏ పంటల సాగుకు ఉప యోగ పడతాయో తెలుసుకోవచ్చన్నారు. ప్రధానోపా ధ్యాయులు గుర్రప్ప, వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు, వీఏఏ సుబ్రహ్మణ్యం, శాంతి పాల్గొన్నారు.

పిల్లల పండుగను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కల్లూరు : నగర శివార్లలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఈ నెల 9, 10న నిర్వహించే కర్నూలు బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి పుల్లయ్య, అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి ధనుంజయ కోరారు. కర్నూలు ఎ.క్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో మంగళవారం బాలోత్సవం లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయం లేకపోవడం వల్ల పిల్లలు ఫోన్లు, ట్యాబ్లకు బానిసలవుతున్నారన్నారు. మార్కులు, ర్యాంకులు, సీట్లు అనే పద్ధతిలో విద్యా సంస్థలు ఉంటున్నాయన్నారు. పిల్లలను కంట్రోల్ చేసుకోవడం టీచర్లకు పెద్ద సమస్య అయిపోయిందని, పిల్లలపై జాగ్రత్త వహించకపోతే వారి మానసిక ఆరోగ్య పరిస్థితి ఆందోళనకంగా మారుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బాలోత్సవం లాంటి కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేలా చేయడం మంచి పరిణామమన్నారు. బాలోత్సవం ద్వారా కొంత మందైనా సెల్ఫోన్ నుంచి దూరంగా ఉండటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. 5వ బాలోత్సవం మంచి వాతావరణంలో దిగ్విజయం కావాలని ఆకాంక్షించారు. బాలోత్సవం అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి ధనుంజయ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి విద్యార్థులు బయట పడేందుకు బాలోత్సవం దోహదం చేస్తుందన్నారు. అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలతో పండుగ వాతావరణంలో బాలోత్సవం నిర్వహించనున్నామని, 2 వేల మందికి పైగా పిల్లలతో ఈ సంబరం జరపనున్నామని తెలిపారు.

12వ వేతన సవరణ సంఘాన్ని తక్షణమే నియమించండి

విశాలాంధ్ర-గడివేముల: రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన 12వ వేతన సవరణ సంఘాన్ని ప్రభుత్వం తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి మానపాటి రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గడివేములలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ 11వ పిఆర్సీ కాలపరిమితి ముగిసి రెండున్నర సంవత్సరాలైనా నేటికీ 12వ వేతన సవరణ కమిషన్ ను నియమించకపోవడం ఉపాధ్యాయ, ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఉపాధ్యాయ, ఉద్యోగులలో ఉన్న అసంతృప్తిని గ్రహించి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ కమిషన్ ను నియమించి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57ను అనుసరించి 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. 2025 జూన్ నెలలో జరిగిన బదిలీలలో బదిలీ పొంది రిలీవర్ లేక నిలిచిపోయిన ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేసి వారి స్థానాలకు పంపించాలని, ఉపాధ్యా యుల కొరత ఉన్న పాఠశాలల్లో అకడమిక్ ఇన్స్ట్రక్ట ర్లను నియమించాలని వారు డిమాండ్ చేశారు. 2010 విద్యా హక్కు చట్టానికి సవరణ చేసి అంతకు ముందే ఉద్యోగంలో చేరిన సీనియర్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ఈ నెల 6 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వంద రోజుల ప్రణాళికను సెలవు రోజుల్లో నిర్వ హించరాదని, గత సంవత్సరం సెలవుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యా యులకు సీసీఎల్ ఇస్తామని చెప్పిన విద్యాధి కారులు నేటికీ కూడా ఇవ్వలేదని వారు అధికా రుల తీరును విమర్శించారు. తప్పని సరిగ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే సీసీఎల్ తప్పక ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ గడివేముల మండల శాఖ అధ్యక్షులు ఎం. ప్రతాప రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్.బాలస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్.మహబూబ్ బాషా, టి.గోపాల్ రావు, సీనియర్ నాయకులు ఎస్.శ్రీనివాసులు, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, మాతృ నాయక్, రాంపుల్లారెడ్డి, మల్లికార్జు నయ్య, వినయ్ కుమార్, కళ్యాణ్, చిన్నయ్య, మంజులవాణి, ఆదిశేషమ్మ, భూషమ్మ, లక్ష్మీదేవి, లలిత, సుభాషిని, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూళ్ళు చేయాలి

విశాలాంధ్ర - చాగలమర్రి: గ్రామాల్లో జనవరి 2026 చివరి కల్లా వంద శాతం ఇంటి పన్నులు వసూళ్ళు పూర్తి చేయాలని నంద్యాల డివిజనల్ పంచాయతి అధికారి రాంబాబు తెలియజేశారు. మంగళవారం స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వివిద రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు, పన్నేతరముల వసూళ్ల చెల్లింపులు పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం డిజిటల్ పేమెంట్ విధానం అమలు చేసిందన్నారు. స్వర్ణ పంచాయతీల్లో భాగంగా ఇంటి పన్నులు, పన్నేతరములు చెల్లించేందుకు ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని అమలు చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా పన్నులు, పన్నేతర వివరాలను సిబ్బంది ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డిజిటల్ పేమెంట్ ద్వారా గ్రామాల్లో ఉన్న ఇళ్లకు పన్ను విధించడం వసూళ్ల చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు డిజిటల్ పేమెంట్ ద్వారా గృహ పన్నులు చెల్లించవచ్చన్నారు. డిజిటల్ పేమెంట్ ద్వారా పన్ను చెల్లించిన వెంటనే లబ్ధిదారులకు, అధికారులకు, ప్రభుత్వానికి మెసేజ్ వస్తుందన్నారు. ఇంటి పన్నులు, పన్నేతరములు పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. ప్రతి రోజు చెత్త సేకరణ చేపట్టాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ తాహీర్‌హుసేన్, జీఎస్‌డబ్లూఎస్ డిప్యూటి ఎంపీడీఓ తారకేశ్వరి, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకులో నగల అపహరణ

విశాలాంధ్ర - వెలుగోడు: పట్టణంలోని స్టేట్ బ్యాంక్‌లో ఋణం కొరకు మహిళ తీసుకు వచ్చిన నగలు చోరికి గురి అయినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన శివారెడ్డి భార్య నందమ్మ నాగమణి పిర్యాదు మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు వెలుగోడు గ్రామంలోని ఎస్బిఐ బ్యాంక్‌కు సంవత్సరం క్రితం పెట్టిన పాత బంగారు వస్తువులను విడిపించుకొనుటకు ఇంటి నుంచి నల్లల దండ, కంకనము, నాన్ పథకము తీసుకొని వచ్చినదని, అయితే లోన్ ఋణం నకు నల్లల దండ మరియు కంకనము సరిపోతాయని బ్యాంక్ వారు చెప్పగా, ఫిర్యాది తన నాన్ పథకమును సంచిలో పెట్టుకొని వుండగా, 12.30 గంటల సమయంలో బ్యాంక్‌లోని సిబ్బంది ఫిర్యాదిని డబ్బులు కట్టిన రశీదు అడగగా, రశీదు కోసం ఫిర్యాది తన సంచిలో చూసుకొనగా, ఫిర్యాది యొక్క 35 గ్రాముల బరువు గల నాన్ పథకం కనపడలేదని, దాని విలువ రూ.1.40 లక్షలు వుంటుందని, ఫిర్యాది నాన్ పథకంను ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగిలించుకుపోయినట్లు ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

హొళగుంద మండలాన్ని విభజిస్తే ఆందోళన చేస్తాం

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి, వంద వాగలి, పెద్ద గోనెహాలు, ఎండి హళ్లి, ఇంగలదా హాల్ గ్రామాలను పెద్ద హరివాన మండలంలో కలపడానికి ప్రయత్నిస్తే ఒప్పుకోమని మండల వైకాపా కన్వీనర్ షఫీ ఉల్లా అన్నారు. ఎల్ఎల్‌సి గెస్ట్ హౌస్ ఆవరణంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హొళగుంద మండలాన్ని విభజిస్తే ఆందోళన చేస్తామని సబ్ కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆదోని జిల్లాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదోని జిల్లాగా చేస్తే అన్ని నియోజకవర్గాలు, మండలాలు అభివృద్ధి చెందుతాయని అందుకోసం ప్రజా ప్రతినిధులు ఆదోని జిల్లాగా చేయడానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వైయస్ జగన్ హయంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు చేసి 30శాతం పనులను పూర్తి చేశారని, ఆదోనికిజిల్లా ఆస్పత్రి మంజూరు చేసిన ఘనత వైఎస్ జగన్‌కి దక్కుతుందని కొనియాడారు. కూటమి ప్రభుత్వం పిపిపి ద్వారా జిల్లా ఆస్పత్రి నిర్మించడానికి పూనుకుందని వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పత్తికొండ: సిఐటీయు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటీయు మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పుచ్చకాయల మాడ లో ఆశా వర్కర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆల్ ఇండియా జాతీయ మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాసభలలో సమాన పనికి సమాన వేతనం అమలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధమవుతామన్నారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్లు రాములమ్మ, కృష్ణవేణి, గీతాంజలి, తాయమ్మ, సరస్వతి, ధనలక్ష్మి, నాగవేణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పబ్బతి వేణు అహంకారం తగ్గించుకో

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పబ్బతి వేణు అహంకారం తగ్గిం చుకో, కమ్యూనిస్టులపై విమర్శలు మానుకో, అరచేతిని అడ్డు పెట్టి సూర్యకాంతిని ఆపలేరని, సిపిఐని విమ ర్శించి, అవినీతిని కప్ప లేరని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న బిల్డర్ పబ్బతి వేణుకు హితవు పలికారు. పట్టణంలో బిల్డర్ వేణు సిపిఐని విమర్శించి తన తప్పులను కప్పి పుచ్చుకునే ఆరాటం మానుకుని ఆర్యవైశ్య కుటుంబాలకు న్యాయం చేయాలని తెలిపారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఆర్యవైశ్య ప్రముఖులు తాళ్లపల్లి వీరయ్య కుటుంబానికి చెందిన ఆస్తిని ఫోర్జరీ సంతకాలతో ఆస్తి కాజేసి న్యాయ వ్యవస్థనే దిక్కరించి కోట్లు గడించేందుకు రాజకీయ వ్యవస్థను అడ్డు పెట్టుకొని న్యాయశాఖ మంత్రికి మచ్చ తెస్తూ పబ్బం గడుపుకుంటున్నారని సోమన్న ఆరో పించారు. నంద్యాల సీపీఐ పార్టీ కార్యాలయంలో సోమన్న విలేఖరులతో మాట్లా డుతూ పబ్బతి వేణు తాళ్లపల్లి వీరయ్య కుటుంబానికి చెందిన ఆస్తిని ఫోర్జరీ సంతకాలతో స్వాధీనం చేసుకున్నాడని, బహిరంగంగా వారి కుటుంబ సభ్యులే రోడ్డుకెక్కితే దానికి సమాధానం చెప్పలేక, అవినీతి మోసాలకు ఆజ్యం పోసు కుంటున్నావని, ఇప్పటికైనా సిపిఐని విమర్శించడం మానుకోకపోతే తగిన గుణపాఠం చెప్పేందుకు సన్నద్ధమవుతామని సోమన్న హెచ్చరించారు.

చురుగ్గా సాగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

విశాలాంధ్ర - హొళగుంద: స్థానిక వాల్మీకి సర్కిల్ నుండి అయోధ్య నగర్ కాలనీ వరకు రూ.50 లక్షలతో నిర్మించ తున్న సిమెంట్ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎంతో అధ్వానంగా ఉన్న రోడ్డు మీద నడిచి నానా అవస్థలు పడ్డామని సిమెంటు కొత్త రోడ్డు వేయడం వల్ల రాకపోకలకు ఎంతో అను కూలమైందని, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సుగుణ కన్స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేస్తున్నారు. రోడ్డు తవ్వి వేట మిక్చర్ వేసి ట్రాక్టర్ ద్వారా చదువు చేసి రూలర్ తిప్పి రోడ్డును గట్టిగా చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు అనుసంధానం చేసే కొత్త రోడ్డు ఏర్పడడంతో వాహనాల రాకపోకలు కష్టాలు తీరుతాయని డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. కొత్త రోడ్డు మీద జడ్పీఎస్ చెస్ స్కూల్ విద్యార్థులు తోపాటు భక్తులు ప్రజలు ప్రయాణించడానికి ఎంతో అనుకూలం అయింది. మండల టిడిపి కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం ప్రసాద్ సహకారంతో కొత్త సీసీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయని అన్నారు. ధనాపురం నుండి హొళగుందా వరకు రూ.13 కోట్ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, మార్లమడికి అడ్డరోస్తా నుండి నాగరికడి వరకు పిఎంజిఎస్‌వై 4 నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధమ య్యాయన్నారు

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - ప్యాపిలి : మండల పరిధిలో ఉన్న సచివాలయాల ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావాలని అంతేకాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ ఆవరణంలో బటరపై లైట్లకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావాలని, గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని అంతేకాకుండా నీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచి ప్రజలు ఆరోగ్యం కాపాడే బాధ్యత వారిదేనని, గ్రామాలలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో తగిన గుణపాఠం చెప్తామని వారు హెచ్చరించారు.